దేవుడు తన కోరికలలో కొన్నింటిని మాత్రమే తీర్చి, మరి కొన్నిటిని ఎందుకు తీర్చడం లేదో తెలిసింది. తనకి హాని చేసే కోరికలు తను కోరినా దేవుడు తీర్చడన్నమాట. అలా అని తనకి మేలు చేసేవి వద్దన్నా, తీర్చకుండా వుండడు. ఇదంతా తన మంచికే. ఎన్నోసార్లు పిల్లలకి జ్వరం వచ్చినప్పుడు ఇంట్లో జరిగే ఆ తంతు చూస్తున్నా తనకి పూర్వం ఈ సమాధానం స్ఫురించలేదు. ఇప్పుడు స్ఫురించడానికి కారణం దేవుడు తన దృక్కోణం మార్చడమే అని గ్రహించాడు.

తనకి జ్ఞానోదయాన్ని కలిగించిన భగవంతునికి అతడు కృతజ్ఞతగా నమస్కరించాడు.

## 33. వాయిదా వేయకూడనిది

ఓ ఊళ్ళో ఒక భక్తుడికి ఇద్దరు కొడుకులున్నారు. వారు కవలలు. చెడు పనులు చేయకపోతే భగవంతుని పూలతో పూజించినట్లేనని, మంచి పనులు చేస్తే స్వామికి చక్కటి నైవేద్యం అర్పించినట్లని చిన్నప్పటినించీ తండ్రి వాళ్ళకి బోధించేవాడు. వీటిని నిత్యం పాటిస్తే అంతకు మించి దైవ సేవలు అవసరం లేదని చెప్పేవాడు.

వారు పెరిగి పెద్దవారవుతున్నకొద్దీ, తండ్రి తమకి బోధించినట్లుగానే నడచుకోసాగారు. ఇద్దరికీ వివాహాలయ్యాయి. తర్వాత పిల్లలు పుట్టి, ఆ తర్వాత వాళ్ళ పిల్లలకి కూడా పెళ్ళిళ్ళయి మనవలు పుట్టారు. ఓ రోజు అద్దంలో చూసుకున్న ఓ సోదరుడు రెండోవాడితో చెప్పాడు.

"శాస్త్రంలో ఏం చెప్పారో తెలుసా? తల మీద తెల్లవెంట్రుక కనబడినా, శరీరంలో ముడత కనబడినా, మనవడ్ని ఎత్తుకున్నా వెంటనే ఏ కాశీకో వెళ్ళి వానప్రస్థాశ్రమంలో శేషజీవితం గడపాలని. మన నాన్నగారు కూడా అదే చేశారు. కాబట్టి మనమూ కాశీకి వెళ్ళిపోదాం."

అందుకు రెండోవాడు ఒప్పుకున్నాడు. ఇద్దరూ అన్ని ఏర్పాట్లు చేసుకుని కాశీకి బయలుదేరారు. ఇద్దరూ నిత్యం ఏదో ఓ సత్కర్మ చేసి కాని నిద్రపోయేవారు కాదు. ఒకనాడు దారిలో ఒక గ్రామంలోని ఓ ఇంట్లో బస చేసారు. మర్నాటికి ఆ ఇంటివాళ్ళకి కట్టెలు అవసరమని తెలుసుకుని పెద్దవాడు వాళ్ళింట్లోని కలప నరికి కట్టెలు కొట్టి పడుకున్నాడు. ఆ ఇంటి వారమ్మాయి వివాహానికి వాళ్ళకి ధన సహాయం అవసరమని గ్రహించిన రెండోవాడు, మర్నాడు ఉదయం నిద్రలేచాక వాళ్ళకి తన దగ్గరున్న ధనంలోంచి కొంత సహాయం చేద్దామనుకున్నాడు.

దురదృష్టవశాత్తూ ఆ రాత్రే ఆ ఇద్దరు కవలలు మరణించారు.

ఇద్దరూ స్వర్గానికే వెళ్ళారు. కాని రెండోవాడి కన్నా పెద్దవాడికి స్వర్గ సుఖాలు ఎక్కువ స్థాయిలో లభించాయి. అది గ్రహించిన రెండోవాడు స్వర్గ లోకంలోని దేవతలని అడిగాడు.

"మేమిద్దరం చివరిదాకా సమానమైన పుణ్యమే చేసాం. ఐనా మా ఇద్దరి మధ్యా ఈ తేడా ఇక్కడ ఎందుకు వచ్చింది?"

"మీకు ఆతిథ్యం ఇచ్చిన గృహస్థుకి కట్టెలు కొట్టిచ్చిన పుణ్యం మీ అన్నకి అధికంగా వుంది. నువ్వు వాళ్ళకి ధన సహాయం చేయాలనుకున్నావు కానీ, దాన్ని మర్నాటికి ఎందుకు వాయిదా వేసావు? కట్టెలు కొట్టడం కన్నా అది తక్కువ శ్రమతో కూడిన పని కదా?" అడిగారు దేవతలు.

అందుకే 'నిత్యం సన్నిహితో మృత్యుః కర్తవ్యో ధర్మ సంగ్రహః' అన్నారు. 'సదా మృత్యువు మనల్ని కబళించడానికి సిద్ధంగా వుంటుంది కాబట్టి ధర్మకార్యాలని ఎప్పుడూ వాయిదా వేయకూడదు' అని దీనర్థం.

## 34. అహం

ఓ గురువు వద్ద అనేకమంది శిష్యులు ఆధ్యాత్మిక విద్యని అభ్యసిస్తున్నారు. ఓ రోజు ఆయన వారితో చెప్పాడు.